క్లుప్తంగా

చిట్యాల తహసీల్దార్‌గా ఇమామ్ బాబా షేక్



చిట్యాల : నూతన తహసీల్దార్‌గా ఇమామ్ బాబా షేక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ హేమ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో ఎలక్షన్ విధులు నిర్వహించిన ఇమామ్ బాబాషేక్ చిట్యాల తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను అభినందించిన ఇన్‌చార్జ్ జీఎం



భూపాలపల్లి అర్బన్ : ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఏరియా ఇన్‌చార్జ్ జీఎం వెంకట్రామిరెడ్డి, ఎస్‌వోటు జీఎం రవీంద్ర అభినందించారు. ఎం.ఆశ్రిత 548 మార్కులు సాధించగా, 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అధికారులు సన్మానించారు. పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మారుతి, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, అధికారులు శ్రీనివాస్, మురళీమోహన్‌లు పాల్గొన్నారు.

5 నుంచి సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు

భూపాలపల్లి అర్బన్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ఈ నెల 5నుంచి ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సురిమిల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల 8నుంచి 20 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 88978 05683, 98499 54299 ఫోన్ నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

వెంకటాపురం(కె) : మండలంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు బుధవారం ఎస్సై కొప్పుల తిరుపతిరావు తిరిగి వారికి సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన నాగమణి, సతీష్, శశికుమార్, ముకుందరావు సెల్‌ఫోన్లు పోగొట్టుకొని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కాగా సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న వారి మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

మద్యం తాగి, ప్లాస్టిక్ పడేసినందుకు జరిమానా

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లి ప్రాంతంలో సౌత్ రేంజ్ పరిధిలోని అడవిలో మద్యం తాగి, ప్లాస్టిక్‌ను పడవేసినందుకు జరిమానా విధించినట్లు సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో మద్యం తాగి, ప్లాస్టిక్‌ను పడవేసినందుకు చట్టపరంగా చర్యలు చేపట్టారు. అభయారణ్యంలో మద్యం తాగిన వ్యక్తులు బూర వినయ్, గోటుకుల రాకేష్, కార్దూరి రాకేష్, గొటుకుల గణేష్, శంకర్, బక్షుల శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసి రూ.15వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అటవీ ప్రాంతంలో మద్యం తాగినా, ప్లాస్టిక్‌ను పడవేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ధాన్యం లోడు వాహనం బోల్తా

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జీడి వాగు ప్రాంత పరిధిలో ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం బుధవారం బోల్తా పడింది. డ్రైవర్ సోదారి రామయ్య కథనం ప్రకారం.. మండలంలోని రోహిర్ గ్రామం నుంచి డీసీఎంలో ధాన్యం బస్తాలను వేసుకొని రాజుపేటకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఇసుక లారీ రావడంతో దాన్ని తప్పించేందుకు వాహనాన్ని పక్కకు తీస్తున్నప్పుడు వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిందని, తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. కాని వాహనం క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపాడు. విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు.

క్రీడా శిబిరాలకు వేళాయె..

నేటినుంచి 31వరకు నిర్వహణ

- 10చోట్ల శిక్షణ శిబిరాలు
- క్రీడాకారులకు మంచి అవకాశం



భూపాలపల్లి అర్బన్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు నెల రోజుల పాటు జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలోనే ఉచితంగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. నేటినుంచి చిన్నారులకు ఆహ్లాదమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన క్రీడాకారులు, పీఈటీల పర్యవేక్షణలో శిక్షణ అందించనున్నారు. వేసవిలో ఇళ్లలో ఖాళీగా ఉండే పిల్లలకు ఇది చక్కటి అవకాశం.

సమయం వృథా కాకుండా..

14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు అర్హులు. వేసవి సెలవులు వృథా కాకుండా వారికి ఇష్టమైన ఆటల్లో ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. ఆధునిక యుగంలో పిల్లలు స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి, చిన్న వయసులోనే అనారోగ్యాల పాలవుతున్నారు. సెలవులను గ్రామీణ, పట్టణ ప్రాంత పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్లుగా ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ ప్రైవేట్ ఉన్నత పాఠశాలల ఆవరణ, అందుబాటులో మైదానాలు, క్రీడా ప్రాంగణాల్లో ఆయా క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

నిధుల కేటాయింపు..

వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లాకు ప్రభుత్వం రూ.50వేల నిధులు కేటాయించింది. ఒక్కో కోచ్‌కు రూ.4 వేల చొప్పున, మొత్తం జిల్లాలో పది శిక్షణ శిబిరాలు నిర్వహించుకోవడానికి రూ.40 వేలు కోచ్‌లకు గౌరవ వేతనం కోసం కేటాయించారు. ప్రమాదంలో గాయాలైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు మెడికల్ కిట్‌కు ఇతరత్రా నిర్వహణకు రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు.

నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే విధంగా..

ఆటలకు దూరమైన పాఠశాలలకు చెందిన పిల్లలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకోవచ్చు. ముఖ్యంగా వేసవిలో సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టు సాధించే అవకాశం ఉంటుంది. సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు, ఆటలు ఆడుకునే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలు ఉంటాయి. ఈ క్రీడల్లో పతకాలు సాధిస్తే క్రీడా కోటా కింద ఉన్నత విద్య నభ్యసించవచ్చు. ఉపాధి అవకాశాలకు కూడా ఆ పతకాలు ఎంతో ఉపయోగపడుతాయి.

కేంద్ర పేరు	క్రీడాంశం
భూపాలపల్లి అంబేడ్కర్ స్టేడియం	అథ్లెటిక్స్
జంగేడు	వాలీబాల్
మహదేవపూర్	వాలీబాల్
చిట్యాల	వాలీబాల్
గణపురం	బాల్‌బ్యాడ్మింటన్
గంగారం	కబడ్డీ
వేములపల్లి	కబడ్డీ
చెల్పూర్	తైక్వాండో
కొత్తపల్లి(ఎస్ఎం)	సాఫ్ట్‌బాల్
కాటారం	ఖోఖో

అన్ని వసతులు కల్పిస్తాం..



“వేసవి దృష్ట్యా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాల్లో పిల్లలకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోచ్‌ల నియామకం కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శిక్షణ శిబిరాల్లో తాగునీరు, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవాలి. - సీహెచ్ రఘు, జిల్లా యువజన క్రీడల ఇన్‌చార్జ్ అధికారి

సహకార సంఘాలతో రైతులకు ప్రయోజనం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం : రైతులకు ప్రోత్సాహం, ప్రయోజనాలు చేకూర్చడమే లక్ష్యంగా హకార సంఘాలు సేవలందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. సహకార సంవత్సర వేడుకల టీషర్టును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘాల బలోపేతం, సేవలను మరింత విస్తృతపర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఓ వాల్యానాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, సీఈఓ ఎడ్ల సతీశ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రాజబాబు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మంత్రి భూమిపూజ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎలికేశ్వరంలో ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భూమి పూజ చేశారు. బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రశాంత్

కాటారం: రైతులు పండించిన ధాన్యంకు మద్దతు ధర కల్పించడం కోసం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మండలంలోని జాదారావుపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బండి రమేశ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు వంశీవర్ధన్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశం కోసం దరఖాస్తు

కాటారం: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గట్టయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 12లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ర్యాలీలో పాల్గొన్న సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్ : అమాయకపు ప్రజలను బలిగొంటున్న ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పాలని, ఉగ్రవాదాన్ని అంతమొందించాలని కోరారు. సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, భాస్కర్, కృష్ణప్రసాద్, రవితేజ, కుమారస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లెంపల్లిలో సివిల్ రైట్స్ డే



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు



పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

మల్హర్ : మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు సివిల్ రైట్స్ డే (పౌరహక్కుల దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు నరేష్, సతీష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా జీవించాలి

మొగుళ్లపల్లి : కులాలు, మతాలకతీతంగా ప్రజలు జీవించాలని ఆర్ఐ శివరామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లిలో అంటరానితనం, అమనుషంపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదని అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అందించాడు .. లగ్గం చేసుకున్నాడు



నాలుగేళ్ల అనంతరం వివాహం చేసుకున్న యువకుడు

టేకుమట్ల: వివాహ అనంతరం మహిళలను వంటింటి కే పరిమితం చేస్తున్న ఈ రోజుల్లో ఉద్యోగమే లక్ష్యంగా తన కాబోయే భార్యను చదివించి ఉద్యోగం సాధించేలా ప్రోత్సాహాన్ని అందించాడు. నాలుగేళ్ల అనంతరం నేడు వివాహం చేసుకున్న యువకుడు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన బండ శ్రీకాంత్‌పాణి 2021లో చిట్యాల మండలంలోని నవాబుపేటకు చెందిన మానసతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. కాగా అప్పటికే డీఎడ్ పూర్తి చేసిన యువతిని వంటింటికే పరిమితం చేయకుండా సమాజంలో ప్రత్యేక గుర్తింపును అందించాలనే లక్ష్యంతో ఉద్యోగాలకు సన్నద్ధం చేయించాడు. ఫలితంగా 2023లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. 8 నెలల శిక్షణ కాలం సైతం పూర్తి చేసింది. డీఎడ్ పూర్తి చేసి డీఎస్సీ రాయగా గత యేడాది అక్టోబర్‌లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించి మహాముత్తారం మండలంలో విధులు నిర్వర్తిస్తుంది. కాగా 2021 ఎంగేజ్‌మెంట్ నుంచి వేచి చూసిన వారు బుధవారం వైభవంగా మండల కేంద్రంలో వివాహం చేసుకున్నారు. ఎట్టకేలకు లక్ష్యాన్ని అందించి లగ్గం చేసుకున్నాడని యువకున్ని పలువురు అభినందించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

- క్షతగాత్రులను కాన్వాయ్‌లో ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో కారు, ఆటో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. బుధవారం సాయంత్రం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండలంలోని ఎలికేశ్వరం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో తన కాన్వాయి నిలిపి క్షతగాత్రులను పరామర్శించి వెంటనే తన కాన్వాయ్‌లోని వాహనంలో మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వేల్పుల మౌనిక, బొగ్గుల శైలజ, చిన్న రాములు, సమత, మౌనిక, సుజాత, ఐశ్వర్య, ద్రాక్షయిని, దుర్గక్క, రవళిలకు గాయాలయ్యాయి. వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు.

ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

- పదో తరగతి ఫలితాల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థుల ప్రతిభ
- అభినందించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు


మణిదీప్


బానోతు రాకేశ్


మేఘన


శ్రీనిధి


తాడిశెట్టి అక్షిత


చంద అజయ్


సాత్విక


వైష్ణవి


హారిక


వైష్ణవి


జనగామ శ్రీజ


రమ్యశ్రీ

కాటారం: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటాపోటీగా ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ కంటే స్వల్ప మార్కుల తేడా పొందినప్పటికీ ఎక్కువ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణ నమోదైంది. గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన మణిదీప్ 572, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన జె.రమ్య 564, మేఘన 563, గంగారం మోడల్ పాఠశాలకు చెందిన షేక్ సానియా 556, దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన లక్ష్మిప్రసన్న 554 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో 500 పై మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

పది ఫలితాల్లో 99.67 ఉత్తీర్ణత

మొగుళ్లపల్లి : పదవ తరగతి ఫలితాల్లో మండలంలో 99.62 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ లింగాల కుమారస్వామి తెలిపారు. మండలంలో 263 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 262 మంది ఉత్తీర్ణులు అయినట్లు పేర్కొన్నారు. ఫలితాల్లో ఎంజేపీ గురుకుల పాఠశాల 563 మార్కులతో మొదటి స్థానంలో, జడ్పీహెచ్ఎస్ ఇస్సిపేట 558తో రెండో స్థానంలో, కేజీబీవీ మొగుళ్లపల్లి 556తో మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎంఈఓ కుమారస్వామి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. మండల మొదట స్థానంలో ఎంజేపి గురుకుల పాఠశాల విద్యార్థి బానోతు రాకేశ్ 563 మార్కులు, ద్వితీయ స్థానంలో ఇస్సిపేట ఉన్నత పాటశాల విద్యార్థిని కదురు మేఘన 558, తృతీయ స్థానంలో కేజీబీవీ విద్యార్థిని బత్తిని శ్రీనిధి 556 వచ్చినట్లు ఎంఈఓ లింగాల కుమారస్వామి తెలిపారు. 99.67 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు.

మల్హర్ మండలంలో 81.6 శాతం ఉత్తీర్ణత

మల్హర్ : రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో మండలం వ్యాప్తంగా 152 మందికి 127 మంది (81.6 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు 39 మంది విద్యార్థులకు 36 మంది, మల్లారం జిల్లా పరిషత్ పాఠశాలో 14 మంది విద్యార్థులకు 12 మంది, ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో 58 మంది విద్యార్థులకి గాను 46 మంది, వల్లెకుంట జిల్లా పరిషత్‌లో ఏడుగురికి గాను ముగ్గురు, పెద్దతూండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరుగురికి ఆరుగురు, మల్లారాం కేజీబీవీలో 28 మంది విద్యార్థులకు 24 మంది ఉత్తీర్ణులయ్యారు. తాడిచర్ల పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.సాత్విక 526, ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన సీహెచ్ వైష్ణవి 526 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. అలాగే ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన హారిక 506 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

టేకుమట్లలో ఉత్తమ ఫలితాలు

టేకుమట్ల : మండల కేంద్రంలో పాటు, మండలంలోని పలు పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు మండల విద్యాధికారి సదాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 45 మందికి 44, కుందనపల్లిలో నలుగురికి నలుగురు, వెంకట్రావులపల్లిలో ఆరుగురికి ఆరుగురు, గర్మిళ్లపల్లిలో 17 మందికి 17 మంది, రాఘవరెడ్డిపేటలో 8 మందికి 8, వెలిశాలలో 13 మందికి 13, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 43 మందికి 43 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మండల టాపర్‌గా కందికట్ల వైష్ణవి నిలిచారు.

పది ఫలితాల్లో శ్రీజకు 581 మార్కులు

పలిమెల : మండలంలోని సర్వాయిపేటకు చెందిన జనగామ శ్రీజ పదో తరగతి ఫలితాల్లో 581 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ చాటింది. శ్రీజ జనగామ జిల్లా కొడకండ్లలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివింది. అధిక మార్కులు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పదిలో మండల టాపర్‌గా రమ్యశ్రీ

చిట్యాల: మండల టాపర్ మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలకు చెందిన పుట్ట రమ్యశ్రీ నిలిచినట్లు మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి, ప్రధానోపాధ్యాయులు ఈర్మిళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కంటే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

‘పది’లో మహదేవపూర్‌కు 70.2 శాతం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలో పది ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. మహదేవపూర్‌కు 70.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ప్రకాశ్ తెలిపారు. 383 మంది విద్యార్థులు హాజరు కాగా, 269 మంది ఉత్తీర్ణత సాధించగా, 114 మంది ఫెయిల్ అయినట్లు ఎంఈఓ తెలిపారు. మహదేవపూర్ బాలికల పాఠశాలలో 516 మార్కులతో ప్రభుత్వ పాఠశాలలో టాపర్‌గా నిలిచింది.

మండల టాపర్‌గా అక్షిత

రేగొండ: మండలంలోని మడ్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన తాడిశెట్టి అక్షిత 529 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ వేల్పుల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తపల్లిగోరి మండల టాపర్

మండలంలోని చిన్న కోడెపాక ఉన్నత పాఠశాలకు చెందిన వర్షిత్‌కుమార్ 525 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ రాజు, హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. జ్యోతి బాపూలే బాలుర విద్యాలయానికి చెందిన చంద అజయ్ 573 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

టాటా ఏస్, టిప్పర్ ఢీ... పలువురికి గాయాలు

చిట్యాల : మండలంలోని రామచంద్రాపూర్ శివారులో బుధవారం టాటాఏస్ వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలైనట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని చిన్నకొమిరె గ్రామం నుంచి భూపాలపల్లికి వివాహ కార్యక్రమానికి 10 మందితో వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని రామచంద్రాపూర్ శివారులో భూపాలపల్లి నుంచి చిట్యాల వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న తొట్ల సునీత, ముత్యాల రాజమ్మకు తీవ్ర గాయాలు కాగా, మధు, శ్రీనివాస్, కొమురమ్మ, రజితలకు స్వల్పగాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బసవేశ్వర జయంతి వేడుకలు



భూపాలపల్లి రూరల్: బసవేశ్వర జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి శైలజ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. బసవేశ్వరుడు దేశంలో సమానత్వానికి, మానవతా విలువలకు ప్రాతినిధ్యం వహించిన మహానుభావుడని కొనియాడారు. బసవేశ్వరుడి సేవలు నేటితరాలకు తెలియాలనే లక్ష్యంలో ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో వీర శైవ లింగయత్, వివిధ కులసంఘాల నాయకులు, కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.